# బ్రహ్మదేవుని మహాసభ

## కాళ్ళూరి జోగారావు

యీ సృష్టి పుట్టి యెన్నికోట్ల సంవత్సరాలో, యెన్ని యుగాలో, ఖచ్చితంగా మనకి తెలియదు. ఆ సృష్టికర్త బ్రహ్మకుకూడ ఇలాటి సంశయమే కలిగింది. అందుకనే ఒక ప్రభవనామ సంవత్సర చైత్రశుద్ధ దశమి గురువారం రోజున తను సృష్టించినవాటి నన్నింటిని పరామర్శించ దలిచి, ఫలానా స్థలంలో సాయంత్రం 8 గంటలకు హాజరు కావాలని సమన్లు పంపాడు.

ఆ సమన్లు అందుకుని రాళ్ళు, గుట్టలు మొక్కలు, చెట్లు, పిపీలకాది ఏనుగు పర్యంతం ప్రతి జీవరాసి, తమ తమ జాతికి ఒక్కో ప్రతినిధిగా, ఆ మహాసభకు హాజరు కాబోతున్నారు.

జాతికి వకటి చొప్పున బయలుదేరినా 84 కోట్లకుపైగా సమావేశం కాగల అవకాశం వుంది. అందుకనే గంగానదీ తీరాన ఉత్తరంగా హిమాలయాల పాదం వరకు గల ఒక సువిశాలస్థలం యెన్నుకోబడ్డది.

ఆకాశం నిర్మలంగా, అక్కడక్కడ పూలు పొదుగుకున్నట్టు, చిన్న చిన్నని మబ్బుతునకలతో ముస్తాబైనట్టు హాయిగా వుంది.

ప్రతి ప్రాణికోటి తమ తమ పరిధిల్లో అలంకరించుకుని సమావేశానికి హాజరైంది. యీ సమావేశంలోని విశేషవింత యేమిటంటే, చేరిన సమస్త జీవుల్లో చాలా వాటికి పరస్పరద్వేష, శతృత్వాలు ఉన్నప్పటికీ, యీనాడు తమమధ్యవున్న రాగద్వేషాలను, భేదాభిప్రాయాలను, శతృత్వాలను విడనాడి, సౌమ్యంగాను, మితృత్వంగాను సంచరిస్తున్నాయి. క్రూరమృగాలు సాధువులుగాను, విషపూరితాలు అమృతతుల్యాలుగాను మారాయి. గోవ్యాఘ్రాలు, పాముకప్పలు, పిల్లియెలుకలు, గ్రద్ద పాములు, నరుడు మృగాలు అన్నీ కలిసి గట్టుగా, సభ్యతగా, సౌమ్యంగా, సమావేశస్థలాన్ని ఆక్రమించి, కుతూహలంగా వున్నాయి.

సమయం 8 గంటలు కావచ్చింది. ఆకాశాన్నుంచి యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుషులు, అష్టాది దేవతలు యీ సమావేశాన్ని తిలకిస్తున్నారు. విష్ణుమహేశ్వర్లుకూడా తమ సతీమణులతో తిలకిస్తుండగా బ్రహ్మ భూమిమీద పాదం మోపాడు. 84కోట్ల జీవులు ఆహ్లాదంతో తమతమ భాషల్లో జేజేలు కొట్టుతూ ధన్యవాదాలు పలుకుతుంటే ఆకాశం దద్దరిల్లింది.




బ్రహ్మ అందరిని ఒకసారి పరామర్శగా చూశాడు.

"పుణ్యజీవుల్లారా! నాయనలారా! యీ భూమిని దానిమీద మిమ్మల్ని సృష్టించి అనంతకాలమైంది. సృష్టి ఆరంభంలోనే మీ అందరికి మీ జీవిత విధాలు నిర్ణయించ బడ్డాయి. యీ ఆదేశానుసారం ఇంతకాలం మీరు మీమీ పరిధుల్లో మీ జీవితాలను సుఖమయంగా గడుపుతున్నారనుకుంటాను. కాని మీకు ఈతిబాధలు వున్నట్టు, వాటిని తీర్చి మీకు సుఖశాంతులు చేకూర్చమని మీ ఇష్ట దేవతలను ప్రార్థిస్తున్నట్టు, ఆ దేవతలు నాకు పదే పదే వర్తమానం అందిస్తూనే వున్నారు, అందుకని యెట్టకేలకు యీ రోజున కొంత వ్యవధి సృష్టించుకొని మిమ్మల్నందరిని పరామర్శించటానికి వచ్చాను. కావున నేను పిలిచిన వారే లేచి తమ యోగక్షేమాలతోపాటు మీ సమస్యలను కూడ విన్నవించుకొనగలరు."

ఇలా పలికి బ్రహ్మదేవుడు మొట్టమొదట మానవుణ్ణి పిలిచాడు. మానవుడు సవినయంగా లేచి చేతులు జోడించుకొని దేముని ఆజ్ఞకొరకు చూస్తున్నాడు అప్పుడు:-

"నాయనా, నేను సృష్టించిన వాటి నన్నిటిలో నీకు అగ్రస్థానం ఇచ్చాను నీవు దానిని యెలా ఉపయోగిస్తున్నావు?" అని అడిగాడు బ్రహ్మ.

"అయ్యా! తమరు నన్ను మిగతా జీవకోటి కంటే జ్ఞానిగాను, ఉత్తమంగాను సృష్టించి, నాకు మెదడును ఇచ్చి, దానిని ఉపయోగించి అభివృద్ధి చెందవలసిందిగా శలవిచ్చారు. తమ ఆజ్ఞాను



సారం, ధిగంబరంగా, లజ్జావిహీనంగా ఆరంభించిన జీవితాన్ని, బుద్ధినుపయోగించి, క్రమేపీ అభివృద్ధి చెందుతూనేటికి వస్త్రధారణా స్థితికివచ్చాను. లజ్జావిహీనత స్వార్థపరతనుంచి సామాజిక సౌభ్రాతృత్వాన్ని అలవరచుకున్నాను. మాంసా, కందమూలఫలభక్షం నుంచి, రకరకాల పక్వాన్నాలు తిన నారంభించాను. మూగ సౌంజ్ఞలు, నిరర్థక పలుకుల నుంచి బయట పడేందుకు వాటికి వక అక్షర రూపం ఇచ్చి, అభివృద్ధి పరిచి నానా రకాల శాస్త్రాలను సృష్టించుకొన్నాను. వాటి ఆధారంగా సృష్టిలో మరుగున పడిన రహస్యాలను వెతికి, సోధించి బైటకి తెచ్చాను, నిరుపయోగంగా కనబడే ప్రతి జడ పదార్థాన్ని సహితం ఉపయోగంలోకి తేచ్చాను. చాలా మటుకు అడవి జీవాలను సంస్కరించి మానవ జీవితానికి ఉపయోగిస్తున్నాను. ఇలా తమరు సృష్టించిన ఇంచుమించు అన్నిటి ఉపయోగం తెలుసుకోగలుతున్నాను. సముద్రాలు, నదులు, పర్వతాలు ఇత్యాదివి వాటి పరిధులు దాటకుండా నివారించ గలుగుతున్నాను. సైన్సు అనే విజ్ఞాన శాస్త్రం కనిపెట్టి, దాని ఆధారంగా వన్య మృగాలను ఒక క్రమ బద్ధంతో ఉపయోగించుకో గలుగుతున్నాను. ఇదే సైన్సుతో, కానరాని వాటిని చూడటం, వినపడని విషయాలను వినటం తెలుసుకో గలుగుతున్నాను. మాకు రెక్కలు లేకున్నా గాలిలో పక్షుల్లా వంటరిగాగాక, నా వెంట వందలమంది సహితం వెంట బెట్టుకొని యెక్కడికంటే అక్కడికి, యెంతదూరమైనా ప్రయాసం లేకుండా యెగురు వేసుకుని పోగల విమానాలని సృష్టించాను. ఇలానే జలచరాల్లా వాటి వలే ఏకాకిగా గాక వేలమందినైనా వకే సమయంలో నా వెంట తీసుకొని రేయింబవళ్ళు సముద్రయానం చేయగల ఓడలను సృష్టించాను. భూగర్భ రహస్యాలను సోధించగలుగుతున్నాను. యెండా వానలను కూడా మదింపుచేసి అవసరాన్నిబట్టి ఉపయోగించ గలుగుతున్నాను. నక్షత్రాంతరంలో ఉన్న ఇతర గ్రహాల ఉనికిని కనిపెట్టగలందులకు కృత్రిమ ఉపగ్రహాలను సృష్టించాను రేడియోలు, టెలిఫోన్లు, టివిలు సృష్టించి మాలో వకనికి తెలిసిన విద్యను ఈ ప్రపంచంలోని ప్రతి మారుమూల నివసిస్తున్న వారికి తెలియజేయగలుగుతున్నాను. సౌర శక్తినించి విద్యుత్ శక్తిని సృష్టించి చిత్రవిచిత్ర పనులు చేయించ గలుగుతున్నాను కాని ....'' అని ఆగాడు.

"నాయనా బిడియపడకు. నీ అభివృద్ధి చూడముచ్చటగావుంది. నీ ఇబ్బందులేవైనావుంటే చెప్పు'' అన్నాడు బ్రహ్మ. అప్పుడు మానవుడు "అయ్యా! మమ్మల్ని సృష్టించినందుకు తమరే మాకు తల్లీ, తండ్రీ. మా ఇబ్బందులు తమతోగాక మరెవరికి చెప్పుకోవాలి? అందుకే మనవి చేస్తున్నాను'' అని మళ్ళీ కొంచెం ఆగి... మా యీ అభివృద్ధిని, మిగతా సృష్టి అంతాచూచి గర్వపడి, ఆనందంతో సహకరించేబదులు, ఓర్వలేక ఈర్ష్యా అసూయలతో అడుగడుగునా మా శ్రమ ప్రయాసాలకు అడ్డుపడుతే కాకుండా, నాశనం చేస్తోంది. ఉదాహరణకు మా వ్యవసాయపు రంగంలో మేము సాధించిన పురోగతిని మెచ్చుకొని తోడ్పడేబదులు వరుణదేవుడు తన సామాన్య గతులుతప్పి, యెక్కువో, తక్కువో నడుస్తున్నాడు. తమరు అతనికి పెట్టిన నియమాలను, కాలాలను మేము సృష్టిలో వుంచుకొని, తదనుకూలంగా వ్యవసాయ రంగంలో ముందంజ వేస్తుంటే, పెనుతుఫాన్ల రూపేణా, అనావృష్టి, కరువుల రూపేణా మా కార్యక్రమాలకు నిరంతరం ఆటంకాలు అవాంతరాలు సృష్టించి మమ్మల్ని నష్టకష్టాలపాలు చేస్తున్నాడు. క్రిమి కీటకాదులుకూడ, ఎన్ని విష ప్రయోగాలు చేసినా, ఆగక మా పంటలన్నింటిని సర్వనాశనం చేస్తున్నాయి. భూమాత కూడ పక్షపాతం చూపిస్తున్నది. యెన్నిరకాల యెరువులు వేసినా, వాటిని మేము వేసిన పైర్లకు అందించిన పోషణ ఇవ్వక, పైర్లను నాశనంచేసే కలుపు మొక్కలకు అందించి, మాకు పంటలుపండకుండా చేస్తోంది. ఇది పక్షపాతం కాదా?

భూగర్భంలో నిరుపయోగంగా పడి వున్న రాళ్ళను, ధాతువులను వెలికితీసి వాటికున్న అసలు విలువలను, వాటి ఉపయోగాలను తెలియజేసి వాటికి అమిత గౌరవం సంపాదించిపెడితే, అవి మాకు శత్రువులై దొరక్కుండా పోతున్నాయి. భూగర్భంలో మైళ్ళలోతులోనున్న కిరసనాయిలు, పెట్రోలు, బొగ్గు, మణిమాణిక్యాలన్ని అతి వ్యయ ప్రయాసలతో బైటకితీసి, వాటి ఉపయోగాలను చాటి చెప్పి, వాటి బ్రతుకులకు విలువలుకట్టి, అవి లేనప్పుడు మానవుని బ్రతుకే మనజాలదు అన్నంత ప్రాముఖ్యత ఇచ్చినప్పటికీ, అవి మా కృషికి తోడ్పడి, వాటంతటవే సులభంగా లభ్యమయ్యే బదులు, యెందుకోగాని తరిగిపోతున్నాయి. ఇలా వకదేమిటి మహాప్రభో! సృష్టిసాంతం మానవుల కృషికి సంపూర్ణ సహకారాలందించి యీ పృథ్విని దివ్యస్వర్గం చేసే బదులు, అన్నీ ప్రతీకారం పూనినట్టు కనిపిస్తోంది. తమరే మాయీదీనస్థితిని చూచి వాటిని, మాకు సహకరించ వలసిందిగా ఆజ్ఞాపించండి ప్రభో!'' అని సవినయంగా నమస్కరించి కూర్చున్నాడు.

తరువాత బ్రహ్మ వనమూలికలు, వృక్ష జాతిని పలకరించాడు.


"అయ్యా! తమరు మా జాతిని యెన్నో రకాలుగా సృష్టించారు. గడ్డి మొదలుకొని మహా వృక్షంవరకు వక జాతిగాను. సన్న తీగ మొదలుకొని యా





దాల తీగపరకున్నా, నీళ్ళల్లో నాచు ఇత్యాది రూపాల్లో మమ్మ సృష్టించారు. అదీగాక మాలో కొన్నిటిని ఫలవృక్షాలు తీగలుగాను. కొన్నిటిని కేవలం పూలు పూచేందుకుగాను, మరికొన్నిటిని కేవలం నీడ గాలినిచ్చేట్టుగాను సృష్టించారు. మాకు ఔషధ శక్తినిచ్చి, వ్యాధిగ్రస్తులకు ఉపయోగ పడేట్టున్నాము. మేము తమ ఆజ్ఞానుసారం అలానే చేస్తున్నాం. కాని ఈ మానవుడు మా జాతిమీద చాలా దురాక్రమణ చేస్తున్నాడు. ఔషధాలుగా పెరిగేందుకు అనువైన భూమినిదున్ని తనకిష్టమొచ్చిన పైర్లు వేసుకుంటున్నాడు. అవి కూడ మా జాతివే అని సహిస్తున్నాం. కాని మిగతా జీవరాసుల్ని వాటిని ముట్టనివ్వడు. యెప్పుడైతే మాకని కేటాయించిన భూమిని మానవుడు తన స్వార్థం కొరకు తీసుకున్నాడో, మిగతా జీవాలకు ఆహారం కొరత యేర్పడ్డది. అవి తమ ఆకలిబాధను తీర్చుకోదలిచినా, తన భూమిలో అడుగు పెట్టనివ్వడు. నిర్దాక్షిణ్యంగా వాటిని సంహరించటమో, నిర్మూలించటమో చేస్తాడు. అయినా అతని ఈ దారుణాన్ని సహించి మేమే మా అడవుల్లో వాటికి అవసరమైనంత ఆహారాన్ని సృష్టింపచేస్తున్నాం. ఇంతటితో తృప్తి పడక మానవుడు తన పరిధుల్ని దాటి మా వన్య పరిధిలోనికివచ్చి, మమ్మల్నందరిని పాపభీతిలేకుండా నరకివేస్తున్నాడు. అంతటితో వూరుకొనక తను సృష్టించుకున్న రంపాలు, వులులు, బాడిసెలు, బర్మాలు ఇత్యాది అనేకవాటితో మమ్మల్ని ముక్కలు ముక్కలుగా నరికి భేదించి అతనికి ఉపయోగపడేలా అమర్చుకుంటున్నాడు. గుట్టల్లో గుహలున్నాయి. నీడనిచ్చేందుకు మేమున్నాం. ఇవేమీ అతనికి పనికిరావట. గుహలు, మేమిచ్చే కందమూల ఫలాలమీద ఇంకా ఆధారపడే తన మానవజాతిని చూచి ఆటవికులని, అనాగరికులని పరిహసించి, తనే నిర్మించుకున్న ఇళ్ళకొరకు మమ్మల్ని ఉపయోగించుకుంటున్నాడు. అయినా ఓర్పుతో వున్నాం. మానవునియొక్క ఈ అకృత్యాలను అతని తెలివితక్కువ పనులుగా భావించి, అతనిని క్షమించి అలవాటు ప్రకారం పూలుపూచి, కాయలు కాచి, ఇంకా అందిస్తూనేఉన్నాం. కాని మళ్ళీ అతను పూలు కోసుకోటం కాకుండా మా కొమ్మలను, చిగుళ్ళను త్రుంచుతాడు. మాకు యెంతబాధ కలుగుతుందో పట్టించుకోడు. పరోక్షరో మా సంతతిని అభివృద్ధి కానివ్వకుండా పక్కటి మిగలకుండా కోసేసుకుంటాడు. పారేస్తాడు. ఇలా మాలో చాలాభాగం ఇప్పటికే వంశనాశనమైనాయి. ఈ మానవుణ్ణి ప్రతిబంధం చేయకపోతే ఇతని అత్యాచారంతో మా వంశాలు నిర్మూలం అవుతాయి. అనవసరంగా మమ్మల్ని హింసించవద్దని ఆజ్ఞాపించండి ప్రభో."

తల పంకించి తరువాత పక్షిజాతి వృద్ధేశించి ప్రశ్నించాడు బ్రహ్మ.



పక్షిజాతికి ప్రతినిధిగా చిలుక చెప్పనారంభించింది.

"అయ్యా! సాధారణంగా మా జాతి వాయుగమనంతో వుంటుంది. క్రింద భూమి మీదికొచ్చినా వృక్షాలమీద నివసిస్తుంది. మాలోని వక తెగ నీటి ఆధారంగా జీవిస్తుంది. మా ఆహారం క్రిమి కీటాడులు మొదలుకొని అడివి జీవరాసులు. సర్పాల వరకున్నా. చెట్టు పూలలోని మధువు మొదలుకొని ఫలాల వరకు వుంటుంది. యెన్నడు మానవుని జోలికిపోము. అతనికి యెన్నడు హాని తలపెట్టలేదు. అటువంటి మమ్మ అతడు బంధించి. తన ఆనందంకొరకు పంజరాల్లో బంధిస్తాడు. మాకు దాంపత్య విరహబాధను కలిగిస్తాడు. శిక్షణ అన్న నెపంతో మమ్మల్ని హింసిస్తాడు. అహింసాత్మక చర్యలను ఘటపడి అణిగిమణిగి వుంటాం. అయితే మాలోమాకు పందాలనిపెట్టి, మమ్మల్ని పురియెక్కించి కొట్లాడిస్తాడు ఆనందిస్తాడు. యీ పందాలతో మాకు మారణాయుధాలు కట్టుతాడు. తత్కారణంగా మాలో ఒకరు చస్తారు. ఇంకొకరు గాయపడుతారు. అప్పుడు చచ్చినదానిని వండుకొని తింటాడు. మా గాయాలకు నామమాత్రం చికిత్స చేస్తాడు. వెంటనే నయం కాకుంటే బలవంతాన మళ్ళీ మమ్మల్ని కూడ చంపి తినేస్తాడు. అతని ఆనందంకొరకు మా ప్రాణాలను బలికొన్నా, మా జాతిమీద యే ప్రత్యేకత చూపడు. ఒక జీవికి ఆహారంగానైనా మా బ్రతుకులు వుపయోగపడుతున్నాయని, సహిస్తున్నాం ప్రభో!"

అంది పక్షి.

ఇది విన్న తరువాత బ్రహ్మ దృష్టి చతుష్పాదుల మీదికి పోయింది. వాటి ప్రతినిధిని అడుగుదామంటే వేటికవే ప్రత్యేకంగా తమ కష్టాలను చెప్పుకోదలిచాయి.

ఇది విన్నతరువాత బ్రహ్మ దృష్టి చతుష్పాదులమీదికి పోయింది. వాటి ప్రతినిధిని అడుగుదామంటే వేదికవే ప్రత్యేకంగా తమ కష్టాలను చెప్పుకోదలిచాయి. అందుకని బ్రహ్మ మొదట గోమాతనుద్దేశించి ప్రశ్నించాడు.

“మమ్మల్ని మానవుడు పట్టుకొని ఆశలుజూపి, మెల్లగా దువ్వి తమ నివాస గృహాలకు తెచ్చుకున్నాడు. క్రమేపీ అతని స్వార్థచింత, దురాగతాలు తెలియవచ్చాయి. మేము ఈనిన తరువాత మా మురుగుపాలను సహితం మా సంతానాన్ని తాగనివ్వడు. తనే పితుక్కుని త్రాగేస్తాడు, ఒక్కనాడుకూడా మా సంతతికి కడుపునిండా, తృప్తిగా పాలు ఇవ్వనివ్వడు. ఉదయం, సాయంత్రం మా దూడలను వదులుతాడు. అవి మా పొదుగులను చేపుతే మాకు పాలు చేపుకువస్తే, వెంటనే మా కళ్ళముందే ఆ పసికందులను విలవిలలాడుతున్నా, లాగి దూరాన కట్టేసి మా పాలన్నీ అతడే పిండుకుంటాడు. మేము మా పిల్లలకొరకు దాచుకుందామని దొంగచేపితే, పాలు కార్చేవరకు మమ్మల్ని కర్రలతో కొడతాడు. మా పసికందులు అతను పితుక్కోగా మిగిలిన వాటినె చాలిచాలకున్నా త్రాగి, ఆకుఅలములు తినుకుంటూ పెద్దగవుతాయి. గర్భం ధరిస్తాం. ఒకవేళ అవి మగవైతే వాటి అగచాట్లు, బాధలకు అంతువుండదు. మెడమీద కాడిపెట్టి నిర్దాక్షిణ్యంగా, భూమిని దున్నిస్తాడు. బండికి కడుతాడు. ఆ బండిపై మేము మోయలేనంత బరువులు వేస్తాడు. బండిని లాగమంటాడు. లాగలేకపోతే తోలు వూడేట్టు కొడతాడు. చచ్చినా అతనికి ఫరవాలేదు. మేము లాగవలసిందే. మరొకరు సవారీబండ్లు చేయించుకొని, దానినిండా జనాన్నెక్కించుకొని, తను ముందర కూర్చొని యెంత దూరమైనా పరుగెత్తుకుంటూ ఆ బండిని లాగమంటాడు. పురికి పురికి అలిసి దారిమధ్యలో చచ్చినా ఫరవాలేదు. చచ్చిన దాన్ని వదిలి ఇంకోదానిని తెచ్చికట్టి లాగిస్తాడు.

బ్రహ్మ యీ నోరులేని శాఖాహార జంతుజాలంమీద జరుగుతున్న అత్యాచారాన్ని విని చలించనట్టయినట్టు కనపడ్డాడు. అయినా యేమీ అనక అడవి క్రూరమృగాలనుద్దేశించి “మీ ఈతిబాధల్ని విన్నవించుకోండి” అని చెప్పాడు. క్రూరమృగాలకు ప్రతినిధిగా సింహం చెప్పనారంభించింది.

సింహం:- అయ్యా! అడవిలో చతుష్పాదక్రూర మృగాల ప్రతినిధిగా సవినయంగా మనవి చేయనేమనగా. అనాది నుంచి మమ్ము శాఖాహార మృగాలను భక్షించి జీవించమని శలవిచ్చినందున ఇంత వరకు అలానే బ్రతుకుతున్నాం. మాకు ఆహారమైన మృగాలను మానవుడు నశింపుజేస్తున్న కారణంగా మాకు ఆహార కొరత యేర్పడ్డది. అందుకని మాదృష్టి పక్షిజాతి మీదకు మరలింది. కాని అవి కూడ మానవుని దురాశయాలకు భీతిచెంది తమ జన్మభూములు, తమ నివేశ స్థలాలను వదిలి విదేశాలకో, దేశ దిమ్మరిగానో వెళ్ళిపోతున్నాయి. అందుకని అవి కూడ మాకు లభ్యంకాని కారణంగా మాజాతి పస్తులతో జీవిస్తున్నది. ఇలా ఎన్నాళ్ళని వుండగలుగుతాం. గత్యంతరం లేక మానవుల నివాస స్థలాలకు వెళ్ళి, వారు సాదుకునే జంతువుల్ని భక్షించక తప్పటం లేదు ప్రభో! కూ యీ సతత మానవునికి, తను మాపై చేసిన దురాక్రమణ పాప ఫలితం అని తెలియక, మమ్ములనే దోషులుగా నిరూపించుకొని, మామీద దండెత్తి మమ్ములను హతమారుస్తున్నాడు. ఆ కీగారక మానవుడు తన ఆనందం కొరకు, ఆహ్లాదం కొరకు మమ్మల్ని పట్టుకొని, బోనుల్లో పెట్టి నిర్బంధిస్తున్నాడు. శిక్షణాశాలల్లో పెట్టి నానా రకాల చిత్ర విచిత్ర పంధాలల్లో శాసిస్తూ తను ఇంపైన పనులను మాచే చేయించి సర్కసులల్లో ధనార్జన చేస్తున్నాడు. అడవికి చక్రవర్తినైన నన్నుగాని రాజు అయిన పెద్దపులినిగాని, మంత్రి అయిన యెలుగు బంటుగాని వదలడు. మమ్మల్నందరిని నీచంగా చూస్తాడు. అదీగాక మా చర్మాలకు ఏవో విలువ కట్టి, వాటిని సమకూర్చుకునేందుకు కూడ నిర్దాక్షిణ్యంగామమ్మల్ని చంపేస్తున్నాడు ప్రభో.

బ్రహ్మదేవుని మొఖంమీద జాలి వుట్టిపడేట్టు కనపడుతున్నది. బ్రహ్మ మానవుణ్ణి ఉద్దేశించి.

“నీవు అన్నీ విన్నావు. నీ సమాధానం ఏముంది” అని ప్రశ్నించాడు.

మానవుడు లేచి బ్రహ్మకు నమస్కరించి “అయ్యా! తెలిసో తెలియకనో మావలన ఇతర ప్రాణకోటికి జరిగే ఈతి బాధలను, ఇప్పుడు తెలుసుకోగలిగాను. నేను చెప్పవలసిన సంజాయిషీ యేమీలేదు. మా అకృత్యాలకు సిగ్గుపడుతున్నాను” అని తల వంచుకున్నాడు.

బ్రహ్మదేవుడు యీ సభ ఇంతటితో పరిసమాప్తం. మళ్ళీ యీ తడవ కలుసుకున్నప్పుడు ఇంకేమైనా వుంటే చర్చిద్దాం. అని లేచి అందరినీ “సుఖీభవ” అని దీవించి సభాస్థలంనుంచి మాయమైనాడు.


ఎంట్రీఫీజు లేకుండా లక్షరూపాయల విలువగల బహుమతులు గెలుపొందండి

| | | |
|---|---|---|
| 10 | 9 | 14 |
| 15 | 11 | 7 |
| 8 | 13 | 12 |

మొదటి బహుమతి రాజదూత్ మోటర్ సైకిల్, కలర్ టి.వి. నూటఒక్క కన్సొలేషన్

| | | |
|---|---|---|
| 11 | | |
| | 12 | |
| | | 13 |

బహుమతులు. గొలుసు పద్ధతిద్వారా జపాన్ మోడల్ సోనీ - హై ఫై టు-ఇన్ వన్ గెలుపొందండి.

పోస్ట్‌కార్డ్‌మీద తొమ్మిది చదరాలను గీసి వాటిలో 8 నుంచి 16 సంఖ్యలను ఉపయోగించి ఎటు కూడినా మొత్తం 36 వచ్చేటట్లు చేయండి. ఒక సంఖ్యను ఒకసారి మాత్రమే ఉపయోగించాలి. మీ ఎంట్రీలను 15 రోజుల్లోగా పంపండి. మాకు చేరిన మొదటి పది ఎంట్రీలకు చేతిగడియారం ఉచిత బహుమతి. SAMRAT SALES (36-JH)

P.B. No: 7174, NEW DELHI- 110 002